
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం। 13। మే। 2024



సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 13 । మే । 2024



కాలజ్ఞాని నడయాడిన నేల

కాలజ్ఞాని, దైవ స్వరూపులు జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు బ్రహ్మంగారిమఠం సిద్ధమవుతోంది. -10లో



వైభవంగా హరి,హరుల రథోత్సవం

పుష్పగిరిలోని కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం హరి, హరుల రథోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. -10లో

గరిష్టం/కనిష్టం
39.4 /28.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 28.8 – 39.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

ప్రగతికి చోటు.. భవితకు ఓటు

పొట్టకూటి కోసం కొందరు.. ఉద్యోగాల పేరిట మరికొందరు వలసపోయిన వారు ఓట్ల పండగకు సొంతూళ్లకు చేరుకున్నారు. ఈ ఐదేళ్లలో జిల్లాలో జరిగిన అభివృద్ధి చూసి మురిసిపోతున్నారు. ముఖ్యంగా మారిన పల్లె తీరును చూసి ముచ్చటపడిపోతున్నారు. మేలు చేసిన నాయకుడికే మరోసారి పట్టం కడతామని స్పష్టం చేస్తున్నారు.

- ఊళ్లకు చేరుకున్న స్థానిక ఓటర్లు
- అభివృద్ధి చూసి ఆశ్చర్యపోతున్న వైనం
- మేలు చేసిన నాయకుడికే ఓటంటూ స్పష్టం
- జిల్లాలో ఈ ఐదేళ్లలో ప్రగతిబాటలో పారిశ్రామిక రంగం
- పరవళ్లు తొక్కిన సంక్షేమం

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలో ఓట్ల పండుగకు సర్వం సిద్ధమైంది. అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయగా.. ఓటు వేసేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇన్నాళ్లు ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఇక్కడి ప్రగతిని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ ఐదేళ్లలో కడప గడపలో అభివృద్ధి పరుగులు పెట్టింది. విద్య, వైద్యం, మౌళిక వసతులతో పాటు పారిశ్రామిక ప్రగతి వేగంగా రూపుదిద్దుకుంది. రాయలసీమ నిరుద్యోగ సమస్యకు ఫుల్‌స్టాప్ పడేలా జేఎస్‌డబ్ల్యూ నేతృత్వంలో స్టీల్ ప్లాంట్ పురుడు పోసుకుంది. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చింది. మరో ప్రభుత్వ మెడికల్ కళాశాల సిద్ధమైంది. చంద్రగ్రహణంతో మసకబారిన కడప అభివృద్ధి నేడు తేజోవంతంగా నిలుస్తోంది. మరోవైపు పేదల ఉన్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో జీవితాలల్లో గణనీయమైన మార్పులు సంభవించాయి.

కొప్పర్తి పారిశ్రామికవాడ పదేళ్లుగా పరిశ్రమల కోసం ఎదురుచూస్తోంది. 2014–19 చంద్రబాబు సర్కార్‌లో నిరాదరణకు గురైన ఈ సెజ్ పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళిక రచించారు. రూ.150కోట్లుతో 801ఎకరాలల్లో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్షర్ క్లస్టర్ ఏర్పాటు చేశారు. రూ.10వేల కోట్లు పెట్టుబడులు సమీకరించి లక్ష ఉద్యోగాలు సృష్టించేందుకు పథక రచన చేశారు. అందులోభాగంగా వేగంగా అడుగులు పడుతోన్నాయి. ఇప్పటికే రూ.80 కోట్లుతో ఏర్పాటు చేసిన ఆల్‌డిక్సన్ కంపెనీ (ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ) ప్రారంభమైంది. ఈసంస్థలో 1100 మందికి యువతకు ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. మరో రూ.127 కోట్లుతో 1800 మందికి ఉపాధి లభించేలా విస్తరణ చేపడుతోంది. రూ.50 కోట్లతో నిర్మించిన డీజీజీ ఎక్స్‌ఫోర్టు ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా మరో 2100 మందికి ఉద్యోగాలు లభించాయి. పారిశ్రామికవృద్ధి సాధిస్తేనే యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే దృక్పదంతో కొప్పర్తి పారిశ్రామిక వాడను తీర్చిదిద్దుతున్నారు. ఇక నాడు-నేడు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 718 ప్రభుత్వ పాఠశాలలు మౌళిక వసతులతో సరికొత్త భవనాలతో రూపుదిద్దుకున్నాయి. రూ.120.34 కోట్లుతో తొలి విడత పనులు పూర్తి అయ్యాయి. రెండోవిడతలో 1005 విద్యా సంస్థలు రూ.289.56 కోట్లుతో ఆధునికీకరించారు.



కడప రిమ్స్ రోడ్డు

రెండేళ్లలోనే సెంచరీ ప్లైబోర్డ్స్ సంస్థ...


బద్వేల్ నియోజకవర్గం గోపవరం సమీపంలో ఏర్పాటు చేసిన సెంచరీ ప్లైబోర్డ్స్ పరిశ్రమకు శ్రీకారం చుట్టిన రెండేళ్లలోనే ప్రారంభించారు. 2023 డిసెంబర్ 23న సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈపరిశ్రమ ద్వారా ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, 2076 మంది స్థానికులకు ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించాయి.

కనువిందుగా కడప సుందరీకరణ

కడప నగరం సుందరీకరణ కనువిందుగా రూపుదిద్దుకుంది. దశాబ్దాలు తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారులు విస్తరణ వేగంగా చేపట్టారు. మరో రూ.120 కోట్లుతో నగరంలోని 12 జంక్షన్లను వృద్ధి చేశారు. రూ.6.85 కోట్లుతో రాజీవ్‌మార్గ్ రోడ్డు, రాజీవ్ పార్క్ ఆధునీకరించారు. రూ.69.2 కోట్లతో పాత బళ్లారి రోడ్డు, రూ.100 కోట్లుతో దేవుని కడప రోడ్డు విస్తరణ చేపట్టారు. రూ.10కోట్లతో ఇండస్ట్రీయల్ ఎస్టేట్ రోడ్డు నిర్మించారు. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో రూ.8.27 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు.



కడప ప్రభుత్వ మానసిక వ్యాధుల ఆసుపత్రి



పులివెందులలోని శిల్పారామం

మెడికల్ హబ్‌గా రిమ్స్...

రిమ్స్ వైద్యశాల ప్రాంగణం మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దారు. రూ.322.82 కోట్లుతో మూడు ఆధునాతన వైద్యశాలలను నిర్మించారు. 452 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, 100 పడకల మానసిక వైద్యశాల, 100 పడకల కేన్సర్ హాస్పిటల్‌ను నెలకొల్పారు. అలాగే మరో రూ.322.82 కోట్లు వెచ్చించి, సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. మరోవైపు పుష్పగిరి కంటి ఆస్పత్రి, ఇంకోవైపు డాక్టర్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని సైతం అందుబాటులోకి వచ్చాయి.

పేదల తలరాతల్లో మార్పు

కష్టం చేస్తేనే నాలుగు వేళ్ల నోట్లోకి వెళ్లే పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వరంగా నిలిచింది. ఆర్థిక తోడ్పాటుకు అనేక పథకాలను రూపొందించింది. బడికి పిల్లలను పంపించే తల్లులను ఆదరించారు. స్వయం ఉపాధి చేపట్టే వారికి ఊతకర్రగా నిలిచారు. మహిళలకు ఆర్థిక స్వావలంబనకు అండగా నిలిచారు. మొత్తంగా జిల్లాలో 9,82,554 మందికి రూ.8,857.5కోట్లు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా ఆయా కుటుంబాల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా మరో 9,72,388 మందికి రూ.3,279 కోట్లు చెల్లించారు. జిల్లాలో మొత్తంగా 19,54,942 మందికి రూ.12,136.5 కోట్లు అందించారు. ఎప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో డబ్బులు చేతికి అందడంతో సామాన్యుల జీవితాల్లో పెనుమార్పులు సంభవించాయి. కరోనా వైరస్ కష్టకాలంలో కూడా సామాన్యుల సేవకుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండడం విశేషం.

పులివెందుల శిగలో వైద్యకళాశాల....

పులివెందుల కేంద్రంగా రూ.500 కోట్లతో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలను నెలకొల్పారు. వ్యవసాయ, ఉద్యాన కళాశాలలు ప్రారంభించారు. రూ.32.82 కోట్లుతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఆకాడమీ ఏర్పాటు చేశారు. రూ.39 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ గార్డన్, రూ.69 కోట్లుతో ఉలిమెల్ల చెరువు సుందరీకరణ, రూ.24కోట్లుతో ఆర్టీసీ బస్టాండ్, డిపో ఏర్పాటు చేశారు. పాడా నిధుల ద్వారా భూగర్భ డ్రైనేజీ, రహదారులు విస్తరణ, నూతన రోడ్లు ఏర్పాటు చేపట్టారు. పార్నపల్లె వద్ద చిత్రావతి జలాశయంలో బోటింగ్ సౌకర్యం కల్పించారు. ఆధునాతన పార్క్‌లు, రింగ్‌రోడ్లు సర్కిళ్లు తీర్చిదిద్దారు.

ఓటు వేయడానికే వచ్చాను



నేను దాదాపు 13ఏళ్లుగా హైద్రాబాద్‌లో ఉన్నాను. అక్కడే నేను ఇంట్రోఫ్రోగ్ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పి సీఈఓగా ఉండి బిజినెస్ చేస్తున్నారు. ఓటు వేయడానికి కమలాపురానికి వచ్చాను. నేను చదువుకున్న పాఠశాల పరిస్థితి చూసి ఆశ్చర్యపోయాను. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలే మారి పోయాయి. మేలు చేసిన నాయకుడిని ఎన్నుకోవడం మా బాధ్యత.
-కె.రాజశేఖర్, సీఈఓ, సాఫ్ట్‌వేర్ కంపెనీ, హైదరాబాద్

చాలా అభివృద్ధి జరిగింది



నేను చెన్నైలో ఐదేళ్ల నుంచి జాబ్ చేస్తున్నాను.వేంపల్లెలో ఎంతో అభివృద్ధి జరగడం చాలా సంతోషంగా ఉంది. ఇంత అభివృద్ధి జరిగిందంటే నేను నమ్మలేకపోతున్నాను. అలాగే ఉర్దూ జూనియర్ కళాశాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయడం ఆనందంగా ఉంది. ఇక్కడ పార్కు కూడా ఏర్పాటు చేశారు.
-నామా ప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, వేంపల్లె

మా ఊరు రూపు రేఖలు మారిపోయాయి

నేను 9 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాను. అక్కడి ఫార్మా ల్యాబ్‌లో సీనియర్ రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేస్తున్నాను. ఓటు హక్కును వినియోగించుకోవడానికి గ్రామానికి వచ్చాను. ఊళ్లోని పాఠశాలలు, సచివాలయం, ఆర్‌బీకే సెంటర్లను చూస్తుంటే కొత్తగా కనిపిస్తోంది. కొత్రపాడు బాగా అభివృద్ధి చెందింది.
– షేక్ అబ్దుల్‌ఖాదర్, సీనియర్ రీసెర్చ్ అసోసియేట్, హైదరాబాద్

బెంగుళూరు నుంచి వచ్చాను



నేను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. ఓటు వేసేందుకు మా ఊరొచ్చాను. ఈ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. ప్రజలకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకుందాం.
– నదీష్‌కుమార్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, కొత్రపాడు

న్యూస్‌రీల్

నేడు సెలవు

కడప కోటిరెడ్డిసర్కిల్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని సోమవారం వివిధ దుకాణాలు, సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు సెలవు ప్రకటించాలని కార్మికశాఖ సంయుక్త కమిషనర్ బాబునాయక్ తెలిపారు. తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకుగాను యాజమాన్యాలు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించే వారు జరిమానాలతోపాటు శిక్షార్హులవుతారని పేర్కొన్నారు.

ఓటింగ్ ప్రక్రియకు ఈవీఎంలు సిద్ధం

కడప సెవెన్‌రోడ్స్: ఓటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం చేశామని.. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ అధికారులు, ఈవీఎం, ఇతర సామగ్రి సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆదివారం ఉదయం నుంచి బయలుదేరిన పోలింగ్ అధికారులు రాత్రి 8 గంటలలోపు పీఓలు, ఏపిఓలు, ఓపిఓలు, మైక్రో అబ్జర్వర్లు, వీడియో గ్రాఫర్స్, పోలీస్ బందోబస్తు నడుమ మొత్తం 1963 పోలింగ్ కేంద్రాలకు 100 శాతం భద్రంగా చేరుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలీసులతో పాటు కేంద్ర బలగాలు ఉన్నాయని, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ప్రత్యేక భద్రతా సిబ్బందికి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎలాంటి ఇబ్బందులుకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని సెక్టోరియల్, రూట్ ఆఫీసుర్లు, పీఓ, ఏపిఓలను ఆదేశించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏమైనా ఇబ్బందులు కలిగితే వెంటనే సంబంధిత సెక్టోరియల్ ఆఫీసుర్లకు లేదా రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని పోలింగ్ అధికారులకు చూచించారు.

అన్నమయ్య జిల్లాలో 42 మోడల్ పోలింగ్ కేంద్రాలు

రాయచోటి: ప్రతి ఓటరును పోలింగ్ కేంద్రానికి రప్పించి ఓటుహక్కును వినియోగించుకోవాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం వివిధ విభాగాలకు చెందిన పేర్లతో మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలోని 32 మండలాల పరిధిలో 42 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా, అందంగా తీర్చిదిద్దింది. జిల్లాలోని 30 మండలాలతో పాటు రాజంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న (వైఎస్ఆర్ జిల్లాకు చెందిన) ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కలుపుకొని 42 మోడల్ పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి.

నేడే పోలింగ్!

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు
- ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోండి: కలెక్టర్ విజయ్‌రామరాజు
- ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి: ఎస్పీ సిద్ధార్థకౌశల్



సాక్షి ప్రతినిధి, కడప: సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7 నుంచి ఓటింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు పోలింగ్ సిబ్బంది ఇదివరకే చేరుకున్నారు. అధికారులు వారికి రూట్లు, పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని అందజేశారు. జిల్లా యంత్రాంగం పోలింగ్ సిబ్బందిని ఆయా కేంద్రాలకు తీసుకెళ్లేందుకు వీలుగా 255 ఆర్టీసీ బస్సులు, 13 డీజీటీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకుని అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు, జిల్లా ఎన్నికల అధికారి విజయ్‌రామరాజు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ఎస్పీ సిద్ధార్థకౌశల్ జిల్లా వ్యాప్తంగా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక గ్రామాలను సందర్శించారు.

- కడప పార్లమెంటు బరిలో 14 మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 110 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జిల్లాలో 16,39,066 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 800857 మంది, మహిళలు 837993 మంది, థర్డ్ జెండర్ 216 మంది ఉన్నారు. ఈసారి 45,196 (2.77 శాతం) మంది కొత్తగా నమోదైన యువ ఓటర్లు తొలిసారి తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. అధికార యంత్రాంగం ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తి చేసింది. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లోని 72 పోలింగ్ కేంద్రాలతో కలిపి జిల్లాలో మొత్తం 2035 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 527 క్రిటికల్ కింద గుర్తించగా, 14 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. వీటిలో 1222 (62.25 శాతం) పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు. అలాగే 741 (37.75 శాతం) పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఉంటుంది. పోలింగ్ నిర్వహణ కోసం రిజర్వుతో కలిపి 4712 కంట్రోల్ యూనిట్స్, 4712 బ్యాలెటింగ్ యూనిట్లు, 5158 వీవీ ప్యాట్స్ వినియోగిస్తున్నారు. జిల్లాను 216 సెక్టార్లుగా, రూట్లుగా విభజించారు. పోలింగ్ నిర్వహణకు 214 మంది సెక్టార్ అధికారులు, 610 మంది మైక్రో అబ్జర్వర్లు, 2334 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2336 మంది ఏపీఓలు, 9360 మంది ఓపీఓలను నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద షామియానా, ఫర్నీచర్, తాగునీరు, లైటింగ్, బారికేడ్లు, ర్యాంపులతోపాటు ఏఎన్ఎం ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య సదుపాయాలను కల్పించారు. ఈవీఎంలు ఏవైనా మొరాయిస్తే సరిచేసేందుకు బెల్ ఇంజనీర్లను అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలను నియమించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు.

గుర్తింపుకార్డు తప్పనిసరి

పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వెళ్లేవారు తప్పనిసరిగా ఓటరు స్లిప్పుతోపాటు గుర్తింపు కార్డును తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓటరుకార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫొటోతో కూడిన బ్యాంకు పాసు పుస్తకం, సేవా గుర్తింపు కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, స్మార్ట్ ఐడీ కార్డు, పీడబ్ల్యూడీ ఐడీ కార్డు, హెల్త్ ఇన్స్యూరెన్స్ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఐడీ కార్డులలో ఏదో ఒకటి ఓటరు తీసుకువెళ్లాలి.

ఓటు హక్కును వినియోగించుకోండి

- కలెక్టర్ విజయ్‌రామరాజు



ప్రజాస్వామ్య పండుగలో భాగంగా సోమవారం జిల్లాలో జరగనున్న పోలింగ్ కార్యక్రమానికి ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజయ్‌రామరాజు పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆమోదించిన ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దానిని వెంట తీసుకువెళ్లాలని సూచించారు. తమ విలువైన ఓటుహక్కును బాధ్యతగా సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య దేశంలో పటిష్టమైన నాయకులను ఎన్నుకోవాలని కోరారు. గత సాధారణ ఎన్నికల కన్నా ఈసారి అధికశాతం ఓటింగ్ నమోదు కావాలని ఆకాంక్షించారు.

అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం

- ఎస్పీ సిద్ధార్థకౌశల్



పోలింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాం. ఎవరైన చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి, అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం. ఎంతటి వారైన సరే వెంటాడుతాం. హద్దు మీరితే పోలీసు చర్యలు ఎలా ఉంటాయో రుచి చూపిస్తాం. ప్రశాంత పోలింగ్‌కు ఎవరిస్థాయిలో వారు సహకరించాలి. పోలింగ్ కేంద్రాలల్లోకి ప్రవేశించడం, దౌర్జన్యకర ఘటనలకు పాల్పడడం లాంటివి ఏమాత్రం ఉపేక్షించమని ఎస్పీ సిద్ధార్థకౌశల్ తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



పెద్దనపాడు, చిలంకూరులలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లతో మాట్లాడుతున్న ఎస్పీ

ఎర్రగుంట్ల: ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. సమస్యాత్మకంగా ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఆదివారం ఎర్రగుంట్ల మండల పరిధిలోని పెద్దనపాడు, చిలంకూరు, సిర్రాజుపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడి ఓటర్లతో మాట్లాడారు. ఎవరూ ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దని, పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఏదైనా జరిగిన వెంటనే పోలీస్‌శాఖకు సమాచారం అందించాలని వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

చాపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లె, నక్కలదిన్నె గ్రామాలలో ఆదివారం జిల్లా ఎస్పీ గ్రామ ప్రజలతో ఎన్నికలపై అవగాహన సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కానీ, గ్రామాలలో కానీ ఎవరైనా సమస్యలు, గొడవలు సృష్టిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

కదిలిన యంత్రాంగం



డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చిన ఉద్యోగులు



డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్



ఎన్నికల విధులకు చిన్నారితో వచ్చిన సిబ్బంది



ఎన్నికల సామగ్రి

సోమవారం జరగనున్న పోలింగ్ కోసం ఎన్నికల సామగ్రిని ఆయా నియోజకవర్గాలలో అధికారులు పంపిణీ చేశారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు తదితర కేంద్రాలలో ఈవీఎంలు తీసుకునేందుకు పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఆదివారం ఉదయమే చేరుకున్నారు. ఎన్నికల సామగ్రిని అందుకున్న సిబ్బంది వారికి కేటాయించిన వాహనాల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలీస్ బందోబస్తు మధ్య చేరుకున్నారు. ఆయా నియోజకవర్గాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులకు ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు.
-కడప సెవెన్‌రోడ్స్



ఎన్నికల సామగ్రితో తరలి వెళుతున్న ఉద్యోగులు